క్లుప్తంగా

పోలింగ్ బూత్ పరిశీలన


ఆబాద్‌వీధిలో పోలింగ్ బూత్ నుంచి బయటకు వస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం టౌన్: పట్టణంలోని ఆబాద్‌వీధిలో ఉన్న ఆనందయాని మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌ను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సోమవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటింగ్ సరళిపై ఆరా తీశారు. పోలింగ్ సక్రమంగా జరుగుతుండడంతో ఆనందం వ్యక్తం చేశారు.

గతం కంటే ఎక్కువ మెజార్టీ

● బడ్డుకొండ అప్పలనాయుడు

డెంకాడ: గతం కంటే ఎక్కువ మెజార్టీతో గెలుస్తానని వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల ఎమ్మెల్యే అభ్యర్థి బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని మోపాడ పాఠశాలలో ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, సతీమణి పద్మావతితో కలిసి సోమవారం ఓటు వేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పోలింగ్‌లో మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఓటుహక్కు వినియోగించుకుంటున్నారని తెలిపారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఎక్కువ మంది ఓటింగ్‌కు వచ్చారని తెలిపారు.

ఓటుహక్కు వినియోగించుకున్న హిజ్రాలు


ఓటు వేశామని చెబుతున్న హిజ్రాలు

విజయనగరం టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా హిజ్రాలు తమ ఓటుహక్కును సోమవారం సద్వినియోగం చేసుకున్నారు. హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాస్ అసోసియేషన్ ప్రతినిధి కొండబాబు ఆధ్వర్యంలో హిజ్రాలు కంటోన్మెంట్ పురపాలక ఉన్నత పాఠశాలలో 88వ బూత్ నంబర్‌లో ఓటు వేశారు.

సత్యసాయి భక్తుల సేవాభావం

రాజాం: సత్యసాయి భక్తులు సేవాభావం చాటుకున్నారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మండలంలోని పలు గ్రామాల పోలింగ్ కేంద్రాల సమీపంలో మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేసి, ఓటర్లకు మజ్జిగ అందజేశారు. వేసవి నేపథ్యంలో ఓటర్ల దాహార్తి తీర్చేందుకు ఈ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు.

రేగిడిలో భారీ వర్షం

రేగిడి: మండలంలో సోమవారం ఉదయం భారీ వర్షం కురిసింది. ఉన్నట్టుండి ఒక్కసారిగా మేఘావృతమై చిరుగాలులతో కూడిన వర్షం కురిసింది. వేసవి ఎండల కారణంగా తీవ్రమైన ఉక్కపోతతో సతమతమైన ప్రజలకు ఈ వర్షం కాస్త ఉపశమనాన్ని ఇచ్చింది.

ఓటు వినియోగించుకున్న 104 ఏళ్ల వృద్ధురాలు


ఓటుహక్కు వినియోగించుకున్న గున్నరాజమ్మ

రాజాం సిటీ: పట్టణ పరిధిలోని బుక్కా వీధికి చెందిన 104 ఏళ్ల మండా గున్నరాజమ్మ అనే వృద్ధురాలు తన ఓటుహక్కును వినియోగించుకుంది. సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని, స్థానిక సారధి బాలికల పాఠశాలలోని పోలింగ్ బూత్‌కు కుటుంబీకుల సహాయంతో సోమవారం వెళ్లిన ఆమె నేను సైతం అంటూ ఓటు వేసి, ప్రజాస్వామ్య స్ఫూర్తి కనబరిచారు. ఓటు ఉన్నా ఓటు వేసేందుకు ముందుకురాని ఎంతోమందికి ఆమె ఆదర్శంగా నిలిచిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఎన్నికల పీఓ అత్యుత్సాహం

రేగిడి: మండలంలోని అంబఖండి పోలింగ్ కేంద్రం వద్ద 95వ నంబర్ పోలింగ్ బూత్ వద్ద ఎన్నికల పీఓ జానకీరావు అత్యుత్సాహం ప్రదర్శించి, విమర్శల పాలయ్యారు. ఓటింగ్ వేసేందుకు వచ్చిన ఓటర్లకు సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని ఆయన ఒత్తిడి చేయడం చూసిన కొంతమంది ఓటర్లు ఆగ్రహించి, నిరసన తెలిపారు. పీవోను ఎన్నికల విధుల నుంచి తప్పించేంత వరకు తాము ఓటు వేయమని ఎన్నికల అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అక్కడ స్వల్ప వివాదం చోటుచేసుకుంది. పీవో దురుసుగా ప్రవర్తించి, ఓటర్లపై విరుచుకుపడగా, పీవోపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఓటర్లు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో పోలీసులు రంగ ప్రవేశం చేసి, వివాదాన్ని సద్దుమణిగించారు. ఓటర్ల వద్ద నుంచి ఫిర్యాదు తీసుకున్న తహసీల్దార్ ఘటనపై ఆరాతీశారు. పీవోను అక్కడి విధుల నుంచి తప్పించి, కొత్త పీవోను ఏర్పాటు చేశారు.

ఓటెత్తిన పౌరులు

- ఎండను లెక్క చేయకుండా బారులు తీరిన ఓటర్లు
- పలు పోలింగ్ బూత్‌ల్లో మొరాయించిన ఈవీఎంలు
- పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఎస్పీ దీపిక
- రాత్రి 9 గంటల వరకు కొనసాగిన పోలింగ్


చీపురుపల్లి: కర్లాం గ్రామంలో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు


చీపురుపల్లిరూరల్: గరివిడి రేగటి అగ్రహారంలో ఓటు వేసేందుకు క్యూలో నిల్చున్న ఓటర్లు


చీపురుపల్లి: చీపురుపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలను సందర్శిస్తున్న ఎస్పీ ఎం.దీపిక


చీపురుపల్లి: కర్లాం గ్రామంలో వృద్ధుడిని ఓటు వేసేందుకు వీల్ ఛైర్‌లో తీసుకెళుతున్న యువకుడు


మెరకముడిదాం: సోమలింగాపురంలో ఓటు వేసేందుకు వీల్ చైర్‌లో వృద్ధురాలును తీసుకువెళ్తున్న బంధువులు


గర్భాంలో ఓట్లు వేసేందుకు క్యూలో వేచిఉన్న మహిళలు

చీపురుపల్లి/చీపురుపల్లి రూరల్/గుర్ల/మెరకముడిదాం: పౌరులు ఓటెత్తారు... ఉదయం 6.30 గంటల నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఎండను సైతం లెక్క చేయకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేందు కు ముందుకు వచ్చారు. నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, గుర్ల, మెరకముడిదాం మండలాల్లో సోమవారం అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు జరిగిన పోలింగ్‌లో ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. నియోజకవర్గంలో ఉదయం 9 గంటలకు 9.16 శాతం పోలింగ్ మాత్రమే జరిగింది. 11 గంటలకు 26.63 శాతం, మధ్యాహ్నం 12 గంటలకు 30.18 శాతం పోలింగ్ నమోదయ్యింది. మధ్యాహ్నం 3 గంటలకు 59.37 శాతం పోలింగ్ నమోదవ్వగా, సాయంత్రం 5 గంటలకు 70.03 శాతం పోలింగ్ నమోద య్యింది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల కోసం ఎన్నికల అధికారులు తాగునీరు, సదుపాయం కల్పించడంతో పాటు టెంట్లు కూడా ఏర్పాటు చేశారు. నడిచి రాలేని ఓటర్లను వీల్ చైర్ల ద్వారా బూత్‌ల్లోకి తీసుకెళ్లారు. చీపురుపల్లి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలోని పోలింగ్ కేంద్రాల ను, గరివిడి శ్రీరాంనగర్ పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ ఎం.దీపిక పరిశీలించారు.

మొరాయించిన ఈవీఎంలు

చీపురుపల్లి, గుర్ల, మెరకముడిదాం మండలాల్లోని పలు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడం, యంత్రాలు ఆలస్యంగా పని చేయడం తదిత ర కారణాల వల్ల పోలింగ్ ప్రక్రియ ఆల స్యంగా జరిగింది. ఫలితంగా రాత్రి 9 గంటలు కావచ్చినా ఇంకా పోలింగ్ ప్రక్రియ జరుగుతూనే ఉంది. చీపురుపల్లి మండలంలోని కర్లాం గ్రామంలో ఉదయం నుంచి ఈవీఎంలు ఇబ్బంది పెట్టడంతో పోలింగ్ ఆలస్యంగా జరిగింది. రావివలస, పుర్రేయవ లస గ్రామాల్లో సైతం రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. గుర్ల మండలంలోని చింతలపేట, నడుపూరు, నాగల్లవలసలో రాత్రి 8 గంటల దాటినా వందల సంఖ్యలో ఓటర్లు ఇంకా క్యూలో ఉండాల్సి వచ్చింది. మెరకముడిదాం మండలంలో ఎం.రావివలసలో 300కు పైగా ఓట్లు పోలైన తర్వాత మధ్యాహ్నం 3గంటల సమయంలో ఈవీఎం మొరాయించడంతో దాని స్థానంలో మరొక ఈవీఎంను అధికారులు ఏర్పాటు చేయగా రాత్రి 8 గంటల వరకు, ఉత్తరావల్లిలో ఈవీఎంలు మొరాయించడంతో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ జరిగింది. గరివిడి మండలంలోని వెదుళ్లవలస, కోడూరు గ్రామాల పోలింగ్ కేంద్రాల వద్ద వైఎస్సార్‌సీపీ, టీడీపీ వర్గీయుల మధ్య వాగ్వాదం జరిగి తోపులాటకు దారితీసింది. ఎస్‌ఐ దామోదరరావు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. కొండపాలెం పోలింగు కేంద్రంలో ఈవీఎంలు మొరాయించడంతో కొంతసమయం పోలింగ్ నిలిచిపోయింది.


చీపురుపల్లి: చీపురుపల్లిలో పోలింగ్ తీరును పరిశీలిస్తున్న చీపురుపల్లి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొత్స సత్యనారాయణ


13సిపిపి41 ఏ గుర్ల:


గుర్ల :


చీపురుపల్లి: మెట్టపల్లిలో పింక్ పోలింగ్ కేంద్రంలో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళా ఓటర్లు

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్


శృంగవరపుకోట: సీతంపేటలో సాయంత్రం 6గంటల సమయంలో క్యూలో ఉన్న ఓటర్లు


వేపాడ: సోంపురంలో పోలింగ్ సరళిపై నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావు


జామి: జామిలో వృద్ధురాలిని పోలింగ్ కేంద్రానికి తీసుకువెళుతున్న స్థానికులు


వేపాడ: నీలకంఠరాజపురంలో కర్ర ఊతంతో ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధురాలు

● పలుగ్రామాల్లో వర్షంతో పోలింగ్ ఇక్కట్లు

శృంగవరపుకోట/ జామి/వేపాడ/ లక్కవరపుకోట: సార్వత్రిక ఎన్నికల సమరం సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం కొన్ని బూత్‌లలో ఏజెంట్లు ఆలస్యంగా రావడంతో మాక్ పోలింగ్ ఆలస్య మైంది. దీంతో పోలింగ్‌లో జాప్యం జరిగింది. ఉదయం నుంచి ఒక మోస్తరుగా పోలింగ్ సాగినప్పటికీ ఎండ కారణంగా మధ్యాహ్నం పోలింగ్ మందగించింది. ఎండ తీవ్రత తగ్గిన తర్వాత ఒక్కసారిగా బూత్‌ల వద్ద ఓటర్లు పోటెత్తారు. దీంతో పలు చోట్ల రాత్రి వరకూ పోలింగ్ సాగుతూనే ఉంది. మండలంలో వెంకటరమణపేట, సీతం పేట, శ్రీనివాసకాలనీ, చింతబడి బూత్‌లలో పోలింగ్ రాత్రి వరకూ కొనసాగింది. ఎస్.కోట పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, సీతంపేట బూత్‌లలో ఈవీఎంలు మొరాయించాయి. పలు పోలింగ్ బూత్‌లలో మహిళా ఓటర్లు అధికంగా ఓటు హక్కు వినయోగించుకున్నారు. సాయంత్రం 6గంటల సమయంలో ఈదురు గాలులు, పిడుగులతో వర్షం బీభత్సం సృష్టించింది. సుమారు గంటన్నర పాటు విద్యుత్ లేక బూత్‌ల్లో ఎన్నికల సిబ్బంది, ఓటర్లు అవస్థలు పడ్డారు. పలు చోట్ల సెల్‌ఫోన్ల వెలుతురులో ఓట్లు వేశారు. ఎస్.కోట మండలంలో సీతంపేట, వెంకటరమణపేట, శ్రీనివాసకాలనీల్లో, వేపాడ మండల పరిధిలో సోంపురం, కె.జి.పూడి, జామి మండల కేంద్రంలో పోలింగ్ రాత్రి వరకూ కొనసాగింది. చుక్కవానిపాలెంలో భారీ వర్షంలో పోలింగ్ కేంద్రం వద్ద చెట్టు విరిగి కరెంటు స్తంభాలపై పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయి ఎన్నికల సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. నియోజక వర్గ వ్యాప్తంగా ఈదఫా సార్వత్రిక ఎన్నికల్లో 76.66శాతం పోలింగ్ నమోదయ్యింది. 2,22,475 మంది ఓటర్లలో 1,66,519 మంది ఓటు హక్కు వినియో గించుకున్నారు. 1,08,227 పురుష ఓటర్లలో 78,933 మంది ఓటు హక్కు వినియో గించుకోవడంతో 72.93 శాతం నమోదు అయిందని, 1,14,246 మహిళా ఓటర్లలో 87,585 మంది ఓటు హక్కు వినియోగించుకోవడంతో 76.66శాతంగా పోలింగ్ నమోదైంది. జామి మండలంలో తెలగపాలెం, లొట్లపల్లి పోలింగ్ బూత్‌ల్లో ఈవీఎంలు మొరాయించారు. తెలగపాలెంలో సుమారు గంటకు పైగా ఈవీఎం మొరాయించడంతో ఓటర్లు తీవ్ర యిబ్బందులు పడ్డారు. లొట్లపల్లిలో అరగంటకు పైగా ఈవీఎం మొరాయించింది. జామి మండల కేంద్రంలో రాత్రి 7 గంటలవరకు పోలింగ్ జరిగింది. ఈవీఎంలు మొరాయించటంతో వేపాడ మండలంలోని కొండగంగుబాడిలో బూత్ నంబర్ 68, సోంపురంలోని 79 పోలింగ్ బూత్‌లో రాత్రి 9 గంటలకు ఓటింగ్ కొనసాగింది. బల్లంకి, బానాది, సోంపురం, బొద్దాం పోలింగ్ కేంద్రాలను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావు పరిశీలించారు.


శృంగవరపుకోట: సంతగవిరమ్మపేటలో బారులు తీరిన ఓటర్లు


శృంగవరపుకోట: బొడ్డవరలో మండే ఎండలో క్యూలో ఉన్న ఓటర్ల


వేపాడ: సోంపురంలో రాత్రి 8.30 గంటల సమయంలో క్యూలో ఉన్న ఓటర్లు


శృంగవరపుకోట: సీతంపేటలో సెల్‌ఫోన్ల వెలుతురులో ఓట్లు వేస్తున్న ఓటర్లు


లక్కవరపుకోట: చందులూరు పోలింగ్ బూత్ వద్ద ఓటు వేసేందుకు క్యూలో ఉన్న మహిళలు


వేపాడ: వేపాడలోని 98వ బూత్ వద్ద బారులు తీరిన ఓటర్లు


వేపాడ: వీలుపర్తిలో క్యూలో ఉన్న మహిళా ఓటర్లు


వేపాడ: ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆతవలో వృద్ధుడిని వీల్‌చైర్‌లో తీసుకువెళుతున్న స్థానికులు


వేపాడ: వెల్దాం పోలింగ్ బూత్ వద్ద లైన్‌లో ఉన్న ఓటర్లు


జామి: జామిలో ఓటుహక్కు వినియోగించుకునేందుకు క్యూలో ఉన్న ఓటర్లు


లక్కవరపుకోట: చందులూరులో పోలింగ్ సరళిపై సిబ్బందిని ఆరా తీస్తున్న కడుబండి శ్రీనివాసరావు


లక్కవరపుకోట: చందులూరులో సేవలందిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు


లక్కవరపుకోట: రంగరాయపురంలో వృద్ధురాలిని తీసుకువెళుతున్న యువకుడు

గజపతినగరంలో ప్రశాంతం


గజపతినగరం రూరల్: మరుపల్లిలో ఓటువేసేందుకు క్యూలో ఉన్న మహిళలు


గజపతినగరం: మరుపల్లిలో బారులు తీరిన ఓటర్లు


గజపతినగరం రూరల్: లోగీశ గ్రామంలో వృద్ధుడిని ఓటు వేసేందుకు వీల్ చైర్‌లో తీసుకువెళుతున్న యువకులు


దత్తిరాజేరు: భూపాలరాజపురంలో ఓటు వేయించేందుకు దివ్యాంగుడిని తీసుకువెళుతున్న సహాయకుడు


గజపతినగరం: గజపతినగరం మండలం పురిటిపెంటలో క్యూలో నిల్చున్న ఓటర్లు

బొండపల్లి/గజపతినగరం/గజపతినగరం రూరల్/దత్తిరాజేరు/గంట్యాడ: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సోమవారం చెదురుమదురు సంఘటనలు మినహా ప్రశాంతంగా జరిగింది. బొండపల్లి మండలంలోని దేవుపల్లి, అంబటివలస, గొట్లాం, బొండ పల్లి, రాచకిండాం గ్రామాల్లో రాత్రి 8:30 గంటల వరకు పోలింగ్ జరిగింది. దత్తిరాజేరు మండలంలో దత్తి, కోమటిపల్లి, గొభ్యాం, పెదమానాపు రం గ్రామాల్లో ఈవీఎంలు మొరాయించడంతో ఓటర్లు క్యూలో ఇబ్బందులు పడ్డారు. పెదకాద, పోరలి, ఇంగిలాపల్లి, మరడాం, పాచలవస గ్రామాల్లో సాయంత్రం 6 గంటల లోపల క్యూలో ఉన్న వారంతా రాత్రి 7గంటల వరకు ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజక వర్గం వ్యాప్తంగా పోలింగ్ ముగిసిన అనంతరం ఈవీఎంలను సోమవారం రాత్రి డెంకాడ మండలం జొన్నాడ సమీపంలోని లెండి ఇంజినీరింగ్ కళాశాలలోని స్ట్రాంగ్ రూమ్‌కు ఆర్ఓ తరలించారు.

ఎన్నికల బహిష్కరణ


ఎన్నికలను బహిష్కరించిన బోజరాజపురం గ్రామస్తులు

దత్తిరాజేరు: ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించడం లేదని, తమ సమస్యలు పరిష్కరించడం లేదని ఆరోపిస్తూ గుచ్చిమి పంచాయతీలోని బోజరాజపురం గ్రామస్తులు ఎన్నికలను బహిష్కరించారు.


దత్తిరాజేరు: పెదమానాపురంలో క్యూలో ఉన్న ఓటర్లు


బొండపల్లి: దేవుపల్లిలో క్యూలో ఉన్న ఓటర్లు